

ఆరు రోజుల పాటు వర్షాలు

● వాతావరణ శాఖ వెల్లడి

అడయార్, జూలై 8: రాష్ట్ర వ్యాప్తంగా రాబోయే ఆరు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సోమవారం వెల్లడించింది. నైరుతి రుతుపవనాలు బలపడటంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తర తమిళనాడులోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి. దీనికితోడు బంగాళాఖాతంలో పశ్చిమ గాలులు బలంగా వీస్తున్న కారణంగా తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో కొన్ని చోట్ల వర్షపు జల్లులు కురుస్తున్నాయి. ముఖ్యంగా చెన్నై నగరంలోని అనేక ప్రాంతాల్లో రాత్రిపూట జల్లులు పడుతున్నాయి. ఆదివారం రాత్రి కూడా పలు ప్రాంతాల్లో తేలిక నుంచి మోస్తరు వర్షం కురిసింది. రానున్న 24 గంటల్లో ఆకాశం మేఘావృత్తమై ఉంటుందని, నగరంలోన్ని చోట్ల తేలికపాటి వర్షపు జల్లులు కురిసే అవకాశం ఉందన్నారు. అలాగే, రాష్ట్రంలోని కోస్తాతీర ప్రాంతాలతో పాటు గల్ఫ్ ఆఫ్ మన్నార్ సముద్రతీరంలో గాలుల వేగం గంటకు 35 కిలోమీటర్ల నుంచి 45 కిలోమీటర్ల వేగంతో వీయొచ్చని, అందువల్ల జాలర్లు సముద్రంలో చేపల వేటకు వెళ్ళవద్దని వాతావరణ శాఖ సూచించింది.

ఈ జిల్లాలకు వర్ష సూచన

వచ్చే ఆరు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్న జిల్లాలను వాతావరణ శాఖ వెల్లడించింది. తేని, నాగపట్టణం, తంజావూరు, వేలూరు, కోయంబత్తూరు, చెన్నై, తిరువారూర్, శివగంగై, దిండిగల్, తిరువళ్ళూరు, విల్లుపురం, కాంచీపురం, రామనాథపురం, పుదుక్కోట, మైలాడుదురై, చెంగల్పట్టు, రాణిపేట, తిరువణ్ణామలై జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

రాష్ట్రానికి మరో ఐదు వైద్య కళాశాలలు

● జాతీయ వైద్య విద్యా మండలి ప్రకటన

ప్యారీస్, జూలై 8: రాష్ట్రంలో మరో ఐదు కొత్త వైద్యకళాశాలల ఏర్పాటుకు జాతీయ వైద్య విద్యా మండలి అనుమతులు మంజూరు చేసింది. ఈ మండలి దేశంలో 113 కొత్త వైద్యకళాశాలల ఏర్పాటుకు అనుమతించింది. ఇందులో భాగంగా రాష్ట్రంలో ప్రభుత్వ వైద్యకళాశాలలు లేని జిల్లాల్లో కొత్త కళాశాలలు ఏర్పాటుచేసుకోవచ్చని తెలిపింది. ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రిలో 200 పడకలు, 20 ఐసీయూ పడకలుండాలని, రోగులకు కనీసవసతులు మెరుగుపరచాలని ఆ సంస్థ తెలిపింది. కాగా, రాష్ట్రంలో కొత్త వైద్యకళాశాలలు ఏర్పాటు కానుండడంతో వచ్చే విద్యా సంవత్సరంలో వైద్య విద్యా సీట్ల సంఖ్య కూడా పెరిగే అవకాశముందని వైద్యశాఖ అధికారులు తెలిపారు.

నగర పోలీసు కమిషనర్‌పై వేటు

● కొత్త కమిషనర్‌గా అరుణ్

చెన్నై, జూలై 8 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్ స్ట్రాంగ్ దారుణ హత్య వ్యవహారంపై ప్రభుత్వం సీరియస్‌గా వుంది. శాంతిభద్రతల పరిరక్షణలో విఫలమయ్యారంటూ నగర పోలీసు కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్‌పై బదిలీ వేటు వేసింది. ఆయన్ని పోలీసు శిక్షణా కళాశాలకు బదిలీ చేసింది. ఆయన స్థానంలో సీనియర్ పోలీసు అధికారి, నగర శాంతి భద్రతల విభాగం ఏడీజీపీ అరుణ్‌ని నియమించింది. ఈ మేరకు రాష్ట్ర హోంశాఖ కార్యదర్శి పి.అముద సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అదే సమయంలో నగర శాంతి భద్రతల విభాగం డైరెక్టర్‌గా డేవిడ్ సన్ ఆశీర్వాదం నియమితులయ్యారు. రాష్ట్రంలో రాజకీయ నాయకుల వరుస హత్యలు, కళ్ళకుర్చి కల్తీసార సంఘటన తదితర అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడల్లా పోలీసు ఉన్నతాధికారులను బదిలీ చేస్తున్నారు. తాజాగా బహుజన సమాజ్ పార్టీ నేత ఆమ్‌స్ట్రాంగ్ దారుణహత్య రాష్ట్రమంతటా తీవ్ర కలకలం సృష్టించింది. ప్రధాన ప్రతిపక్షాలన్నీ ఆ హత్యను ఖండించాయి. అంతేగాక హోంశాఖను కూడా నిర్వర్తిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి స్టాలిన్ శాంతి భద్రతల విషయంపై సీనియర్ పోలీసు అధికారులతో చర్చించారు. పర్యవసానంగా గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ సందీప్‌రాయ్‌రాథోడ్‌ను బదిలీ చేసి, శాంతి భద్రతల విభాగం ఏడీజీపీ అరుణ్‌ను కొత్త కమిషనర్‌గా నియమించారు.



గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఏడీజీపీ అరుణ్

రౌడీలపై ఉక్కు పాదం: అరుణ్

నగరంలో రౌడీయిజాన్ని నిర్మూలించేందుకు కఠిన చర్యలు తీసుకుంటానని, అదే సమయంలో కట్ట పంచాయతీలను నిరోధిస్తానని కొత్త పోలీసు కమిషనర్ ఆరుణ్ తెలిపారు. పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ... నగరంలో శాంతి భద్రతలను పరిరక్షించి, నేరాలను నిరోధించి, ట్రాఫిక్ సమస్య కూడా పరిష్కరించి నగరవాసులందరికీ విశిష్టమైన సేవలందించడమే తన కర్తవ్యంగా భావిస్తున్నానని చెప్పారు. రాజధాని నగరానికి పోలీసు కమిషనర్‌గా పనిచేయడం తనకెంతో గర్వకారణంగా ఉందని, చెన్నైలోని పలు ప్రాంతాల్లోనూ పనిచేశానని చెప్పారు. నగరంలో నేరాలు అధికమైనట్లు కొన్ని వర్గాలు ఆరోపిస్తుండటం గర్హనీయమని, వాస్తవానికి గణాంకాలను పరిశీలిస్తే నేరాలు ప్రతియేటా తగ్గుతున్నాయేగానీ, పెరగటం లేదని చెప్పారు. ఒకటిరెండు అవాంఛనీయ సంఘటనలు జరిగినంత మాత్రాన శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించినట్లు భావించడం కూడా సరికాదని నూతన పోలీసు కమిషనర్ వ్యాఖ్యానించారు.

చెన్నై కమిషనరేట్‌కు 110వ కమిషనర్

గ్రేటర్ చెన్నై 110వ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అరుణ్ 1998వ సంవత్సరం బ్యాచ్‌కి చెందినవారు. నాంగునేరి, తూత్తుకుడి తదితర ప్రాంతాల్లో డీఎస్పీగా, కరూరు, కన్నియాకుమారి, తిరుప్పూరు జిల్లాల్లో ఎస్పీగా సేవలందించారు. చెన్నైలోని అన్నానగర్, సెయింట్ థామస్‌మౌంట్ తదితర ప్రాంతాల్లో డిప్యూటీ పోలీసు కమిషనర్‌గా పనిచేశారు. సీబీసీఐడీలో సుదీర్ఘ కాలం సేవలందించిన అనుభవమున్న అరుణ్ శాంతి భద్రతలను పరిరక్షించడంలో దిట్ట. 2012లో ఐజీగా పదోన్నతి పొంది తిరుచ్చి సర్కిల్ ఐజీగా, ఆ తరువాత తిరుచ్చి మహానగర ఎస్పీగా పనిచేశారు. చెన్నై మహానగర రవాణా సంస్థ అడిషనల్ కమిషనర్‌గాను సేవలందించారు. 2022 ఏడీజీపీగా పదోన్నతి పొంది, ఆవడి మహానగర పోలీసు కమిషనర్‌గా నియమితులయ్యారు. రాష్ట్ర శాంతి భద్రతల విభాగంలో సేవలందిస్తున్న అరుణ్ గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు.



మట్టిని ఉచితంగా తీసుకెళ్లేందుకు రైతుకు అనుమతి పత్రం అందజేస్తున్న ముఖ్యమంత్రి

రైతులకు ఉచిత మట్టి పథకం

● ప్రారంభించిన సీఎం స్టాలిన్ ● చెరువులు, వాగుల నుంచి సేకరణకు అనుమతి

ప్యారీస్, జూలై 8: రాష్ట్రంలో పంచాయతీ యూనియన్ నిర్వహణలో ఉన్న చెరువులు, వాగుల నుంచి ఉచితంగా బంకమన్ను, ఒండ్రు మట్టి తీసుకెళ్లే పథకానికి ముఖ్యమంత్రి స్టాలిన్ సోమవారం శ్రీకారం చుట్టారు. సచివాలయ ప్రాంగణంలో సీఎం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పైలెట్ పథకం కింద కాంచీపురం జిల్లాకు చెందిన పది మంది రైతులు అనుమతి ఉత్తర్వులు పొందారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దురైమురుగన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, ప్రకృతి వనరుల శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి కె.ఫణీందర్ రెడ్డి, గనుల శాఖ కమిషనర్ శరవణవేల్‌రాజ్, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వ్యవసాయానికి, మట్టి పాత్రల తయారీకి అవసరమైన బంక మట్టి, ఒండ్రు మట్టిని జలవనరుల శాఖ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖ ఆధీనంలో ఉన్న చెరువులు, వాగుల నుంచి ఎలాంటి ఫీజు లేకుండా ఉచితంగా పొందవచ్చని సీఎం తెలిపారు. ఈ విధానం అమలులోకి వస్తే చెరువులు, వాగుల్లో లోతు పెరుగుతుందని, ఇందువల్ల వాననీటి అధిక శాతం నిల్వ ఉంచుకోవచ్చని సీఎం తెలిపారు. లబ్ధిదారులు ఆన్‌లైన్ ద్వారా తమ పేర్లు నమోదుచేసుకోవచ్చని, ఈ దరఖాస్తులను ఆయా ప్రాంతాల్లో ఉన్న తహసీల్దార్లు పరిశీలించి అనుమతులిస్తారని తెలిపారు. లబ్ధిదారులు వాననీటి సేకరణపై శ్రద్ధ చూపాలని, చెరువులు, వాగులు కలుషితం కాకుండా అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు.

అన్నాడీఎంకేను విచ్ఛిన్నం చేయలేరు: ఓపీఎస్

పెరంబూర్, జూలై 8: అన్నాడీఎంకేను ఎవరూ విచ్ఛిన్నం చేయలేరని మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్ సెల్వం తెలిపారు. శివగంగలో ఆదివారం తన మద్దతుదారులతో సమావేశమై ఓపీఎస్ విలేఖరులతో మాట్లాడుతూ... అన్నాడీఎంకే విచ్ఛిన్నమవుతోందని కాంగ్రెస్ సీనియర్ నేత పీటర్ అల్ఫోన్స్ చేసిన వ్యాఖ్యలు ఖండిస్తున్నానన్నారు. ప్రస్తుతం పార్టీలో కొంత స్తబ్దత నెలకొందన్నారు. త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కారమై, ఏక నాయకత్వంతో మళ్లీ ప్రజల సమస్యలపై గళం విప్పే శక్తిగా మారనుందని తెలిపారు. బీఎస్పీ అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్‌తో హత్యతో రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని అర్థమవుతుందని తెలిపారు. తమకు రక్షణ కల్పించలేని డీఎంకే ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని ఓపీఎస్ వ్యాఖ్యానించారు.

రాష్ట్రంలో బీజేపీకి తావులేదు

● విక్రవాండి ప్రచారంలో మంత్రి ఉదయనిధి



ప్రచార సభలో మాట్లాడుతున్న మంత్రి ఉదయనిధి

ప్యారీస్, జూలై 8: ప్రధాని నరేంద్ర మోదీ ఎనిమిదిసార్లు రాష్ట్రానికి వచ్చి లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నా, బీజేపీ ఒక్క స్థానంలో కూడా గెలవలేక చతికిలపడిందని, కమలం పార్టీకి రాష్ట్రంలో స్థానంలేదని యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ మంత్రి ఉదయనిధి ఎద్దేవా చేశారు. విక్రవాండి అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక ప్రచారం సోమవారం సాయంత్రంతో ముగిసిన నేపథ్యంలో, మంత్రి ఉదయనిధి ఉదయం తుంబూరు ప్రాంతంలో డీఎంకే అభ్యర్థి అన్నియూర్ శివకు మద్దతుగా ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈవీఎంలో ఉదయించే సూర్యుడి గుర్తు ఎలా ముందు స్థానంలో ఉందో అలాగే, ఓట్ల లెక్కింపులో కూడా ప్రథమస్థానంలో ఉండేలా డీఎంకే, మిత్రపక్షాల కార్యకర్తలు అప్రమత్తంగా పనిచేయాలని కోరారు. ఇటీవల ముగిసిన లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల్లో డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ కూటమి పార్టీలను 40 స్థానాల్లో గెలిపించి బీజేపీ అడ్రస్ లేకుండా చేశారని, ఈ ఉప ఎన్నికల్లో ఓటమి భయంతోనే అన్నాడీఎంకే, డీఎండీకే పార్టీలు ఎన్నికలు బహిష్కరిస్తున్నట్లు ప్రకటించాయన్నారు. అన్నియూర్ శివను లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించాలని ఆయన పార్టీ కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. నీట్ ప్రోత్సహిస్తున్న బీజేపీతో చేతులు కలిపిన పీఎంకేకు ఈ ఉప ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని మంత్రి ఉదయనిధి పిలుపునిచ్చారు.

అంతటా రౌడీల రాజ్యం

ఈపీఎస్ ధ్వజం

● దోచుకోవడమే పాలకుల లక్ష్యం ● పార్టీకి ఓపీఎస్ నమ్మక ద్రోహి

చెన్నై, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, ఎటు చూసిన రౌడీల రాజ్యంలా తయారైందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ధ్వజమెత్తారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి ఏయే శాఖల ద్వారా ఎంత మేరకు ధనాన్ని దోచుకోవాలన్నదే పాలకుల ప్రధాన లక్ష్యంగా ఉందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సేలంలో సోమవారం ఉదయం ఆయన్ని తమిళనాడు యాదవ మహాసభ నిర్వాహకులు కలుసుకున్నారు. త్వరలోనే నిర్వహించనున్న కార్యక్రమానికి ఆహ్వానించారు. అనంతరం ఈపీఎస్ మీడియాతో మాట్లాడుతూ... హోంశాఖ కూడా నిర్వర్తిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్ పోలీసు శాఖ స్వేచ్ఛగా పనిచేసేందుకు వీలు కల్పించివుంటే శాంతి భద్రతలు క్షీణించేవికావన్నారు. రాష్ట్రంలో ఎవరి ప్రాణాలకు భద్రతలేదని ఆరోపించారు. రాజధాని నగరం చెన్నైలో ఓ పథకం ప్రకారమే బీఎస్పీ నేత ఆర్మ్‌స్ట్రాంగ్ దారుణహత్య జరిగిందని,



ఈపీఎస్‌తో తమిళనాడు యాదవ మహాసభ నిర్వాహకులు

పోలీసులు ముందస్తు చర్యలు తీసుకుని ఉంటే ఆయన ప్రాణాలు దక్కేవని ఆరోపించారు. పోలీసు ఉన్నతాధికారులను బదిలీ చేసినంత మాత్రాన శాంతి భద్రతలు పటిష్ఠం కావని పేర్కొన్నారు.

ఓపీఎస్‌ను చేర్చుకునే ప్రసక్తి లేదు

అన్నాడీఎంకే వ్యవహారాలు గురించి ఒ.పన్నీర్ సెల్వం (ఓపీఎస్) మాట్లాడటం మానుకోవాలని ఈపీఎస్ సూచించారు. తమ పార్టీ సభ్యుడే కాని వ్యక్తి తమ పార్టీ గురించి ఎలా మాట్లాడతారని ప్రశ్నించారు. ఓపీఎస్ నమ్మకద్రోహి అని, పార్టీలో కుట్రలకు అతనే ఆద్యుడని ఆరోపించారు. పార్టీ కార్యాలయంపై దాడి చేసి, తీవ్ర నష్టం కలిగించారన్నారు. అంతేగాక ప్రత్యర్థులతో చేతులు కలిపి తమ పార్టీలోనే చీలికలు తెచ్చేందుకు ప్రయత్నించాడన్నారు. అలాంటి వ్యక్తి ఏ ముఖం పెట్టుకుని మళ్లీ తమ పార్టీలో చేరేందుకు ప్రయత్నాలు చేస్తాడని కటువుగా ప్రశ్నించారు. ఓపీఎస్‌ను మళ్లీ పార్టీలో చేర్చుకునే ప్రసక్తే లేదని ఈపీఎస్ పునుద్ఘాటించారు.

కుమరిలో వెనక్కి వెళ్లిన సముద్రం

● భయాందోళనలో స్థానికులు ● పర్యాటకుల అవస్థలు



అడయార్, జూలై 8: రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో ఒకటైన కన్నియాకుమారి సముద్ర తీరంలో నీరు ఉన్నట్టుండి వెనక్కి వెళ్ళింది. దీంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. సోమవారం ఉదయం కుమరి జిల్లాలోని వివేకానంద రాక్, తిరువళ్ళూరు విగ్రహాల వద్దకు వెళ్ళేందుకు పర్యాటకులు చేరుకున్నారు. వీరంతా బోటుల్లో ప్రయాణం చేసేందుకు టిక్కెట్లు కొనుగోలు చేసి నిల్చొన్నారు. ఆ సమయంలో ఉన్నట్టుండి సముద్రం నీరు వెనక్కి వెళ్ళింది. దీంతో పడవ ప్రయాణాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. దాదాపు రెండు గంటల తర్వాత పడవ ప్రయాణాన్ని మళ్ళీ ప్రారంభించడంతో పర్యాటకులు ఊపిరి పీల్చుకున్నారు. ఆదివారం కూడా ఇదే పరిస్థితి నెలకొన్న విషయం తెల్సిందే. గత కొన్ని రోజులుగా పలు తీర ప్రాంతాల్లో సముద్రం నీరు ఒక్కసారిగా వెనక్కి వెళ్తున్న విషయం తెల్సిందే. ఇలా ఉన్నట్టుండి వెనక్కి వెళ్ళడం, కొన్ని గంటల తర్వాత మళ్ళీ పూర్వస్థితికి రావడం జరుగుతుంది. ఇలా జరగడానికి గల కారణాలు మాత్రం తెలియడం లేదు. మరికొన్ని సందర్భాల్లో సముద్రర అలలు నాలుగు నుంచి ఐదు అడుగుల వరకు ఎగిసిపడుతుంటాయి. అలాంటి సమయాల్లో కూడా పడవ ప్రయాణాన్ని పర్యాటక శాఖ అధికారులు నిలిపివేస్తున్నారు.

కొత్త క్రిమినల్ చట్టాలపై సీఎం సమీక్ష



చెన్నై సచివాలయంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త క్రిమినల్ చట్టాలను సవరించే విషయమై అధికారులతో చర్చలు జరుపుతున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

సమాచార ధ్వని

కూడన్‌కుళంలో విద్యుదుత్పత్తి ప్రారంభం

ఐసిఎఫ్, జూలై 8: తిరునల్వేలి జిల్లా కూడన్‌కుళం అణువిద్యుత్ కేంద్రంలోని రెండవ యూనిట్‌లో ఉత్పత్తి మళ్లీ ప్రారంభించారు. ఈ కేంద్రంలోని రెండు యూనిట్లలో 2,000 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది. పర్యవేక్షణ పనుల కారణంగా మే 13 నుంచి ఒక యూనిట్‌లో ఉత్పత్తి నిలిపివేశారు. రెండు నెలల పాటు జరిగిన పనులు ఆదివారంతో ముగిశాయి. దీంతో సోమవారం ఉదయం మళ్లీ విద్యుదుత్పత్తి ప్రారంభించామని అధికారులు తెలిపారు.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

ఐసిఎఫ్, జూలై 8: స్థానిక గిండి సహా నాలుగు డివిజన్లలో విద్యుత్ గ్రీవెన్స్ మంగళవారం జరుగనుంది. అన్నాసాలై, అన్నానగర్, గిండి, పొన్నేరి పరిధి ప్రాంతాల్లో ఆయా ఉప విద్యుత్ కేంద్ర ప్రాంగణాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ గ్రీవెన్స్‌లో వినియోగదారులు పాల్గొని తమ సమస్యలు తెలిపి పరిష్కారం పొందాలని విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు.

రూ.24.80 కోట్లతో అడయార్ నది గట్ల పటిష్ఠత

ఐసిఎఫ్, జూలై 8: స్థానిక అడయార్ నది తీర గట్లు రూ.24.80 కోట్లతో పటిష్ఠపరుస్తున్నారు. చెంగల్పట్టు జిల్లా ఆదనూర్‌లో ప్రారంభమయ్యే అడయార్ నది మన్నివాక్కం, వరదరాజపురం, ముడిచూర్, తిరునీర్‌మలై, అనకాపుత్తూర్, కాట్టుపాక్కం, మనపాక్కం, సైదాపేట మీదుగా 42 కి.మీ ప్రవహించి పట్టణంబాక్కం సముద్రంలో కలుస్తుంది. చెన్నై శివారు ప్రాంతాలు, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాల ప్రాంతాల్లో ఈశాన్య రుతుపవన వర్షాకాలాల్లో ఏర్పడే వరద నీరు సముద్రంలో తీసుకెళ్లడంతో ప్రధాన పాత్ర వహిస్తుంది. ఈ నేపథ్యంలో, వర్షాలను దృష్టిలో పెట్టుకొని అక్కడక్కడా ధ్వంసమైన నది తీరాన్ని పటిష్ఠపరిచేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఈ నిధులతో ఇటీవల ప్రారంభమైన పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

నేటినుంచి ఉన్నత విద్య, ఉద్యోగాలపై అవగాహన

ఐసిఎఫ్, జూలై 8: ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు, పోటీ పరీక్షలు, స్వీయ ఉపాధి, వృత్తి నైపుణ్యాలు వంటి వాటిపై అవగాహన కార్యక్రమాలు మంగళవారం నుంచి 15వ తేది వరకు చేపట్టనున్నట్లు చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ తెలిపారు. చెన్నై జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయం ఆధ్వర్యంలో యువకులకు విద్య, ఉపాధి వంటి వాటిపై అవగాహన కల్పించి మార్గదర్శకాలు సూచించనున్నట్లు తెలిపారు. మంగళవారం దివ్యాంగులకు, అనంతరం మిగిలిన వారికి ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు.

నల్లబజారులో మద్యం విక్రయం

అడయార్, జూలై 8: నల్లబజారులో మద్యం విక్రయించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. కోయంబత్తూరు జిల్లా కిణత్తుకడవు, కృష్ణాపురానికి చెందిన పెరుమాళ్ స్వామి(57) కిణత్తుకడవు రైల్వే గేట్ సమీపంలో టైలరింగ్ షాపు నడుపుతున్నాడు. ఈయన షాపులో అక్రమంగా మద్యం బాటిళ్లను విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు ఆ షాపులో తనిఖీలు చేయగా, మొత్తం 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఆయనపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. కాగా, పెరుమాళ్‌స్వామి అరెస్టు నేపథ్యంలో ఆయన స్థానిక ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌తో కరచాలనం చేసిన వీడియో ఒకటి ఇపుడు సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు.

గిరివలం మార్గంలో సాధువు మృతి

అడయార్, జూలై 8: తిరువణ్ణామలైలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అరుణాచలేశ్వర స్వామి గిరివలం మార్గంలో చెన్నైకు చెందిన ఓ సాధువు మరణించారు. అతడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు తిరువణ్ణామలై పశ్చిమ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. మృతుడి గురించి వివరాలు సేకరించగా, చెన్నైకు చెందిన రాజేంద్రన్ అనే వ్యక్తి గత ఐదేళ్లుగా తిరువణ్ణామలైలోనే ఉంటున్నట్టు గుర్తించారు. ఈయన కుటుంబ సభ్యుల వివరాలు తెలియరాలేదు.

జంతువుల ద్వారా వ్యాపించే వ్యాధులపై అవగాహన

ఐసిఎఫ్, జూలై 8: జంతువుల ద్వారా వ్యాపించే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ఆరోగ్యశాఖ అధికారులకు ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీచేసింది. దేశంలో రాబిస్, బ్రుసెల్లోస్, సిస్టిసెర్కోసిస్, జపాన్ బ్రెయిన్ అలర్జీ, ప్లేగు, లెప్టోస్ బ్రోసిస్, కేఎఫ్‌టీ వ్యాధులకు ప్రజలు గురవుతున్నారు. ఇటీవల ఏవియన్ ఇన్‌ఫ్లుయంజా,నిఫా, సీసీహెచ్‌ఎఫ్, హెచ్1 ఎన్1వంటి వ్యాధులు వ్యాపిస్తున్నాయి. వీటికి సంబంధించి అవగాహన కల్పించాలని అధికారులకు ఆరోగ్య శాఖ ఆదేశించింది. అలాగే జంతువుల ద్వారా వ్యాపించే వ్యాధులపై కళాశాలు, పాఠశాలల్లో కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించింది.

చెన్నై-బిట్రగుంట రైళ్ల రద్దు

పెరంబూర్, జూలై 8: విజయవాడ డివిజన్ పరిధిలో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా బిట్రగుంట-డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ప్రకారం, నెం.17237 బిట్రగుంట నుంచి ఉదయం 4.55 గంటలకు డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ బయల్దేరే ఎక్స్‌ప్రెస్ రైలు, నెం.17238 డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ నుంచి సాయంత్రం 4.30 గంటలకు బిట్రగుంట బయల్దేరే రైలు ఈ నెల 29,30,31, ఆగస్టు 1,2,12, 13,14,15,16,19,20,21,22,23,26,27,28,29,30 తేదీల్లో పూర్తిగా రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

వ్యవసాయ వర్సిటీ దూరవిద్యలో నాలుగు కొత్త కోర్సులు

పెరంబూర్, జూలై 8: తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం దూరవిద్యలో 4 కొత్త కోర్సులు ప్రవేశపెట్టింది. ఈ వర్సిటీలో ఓపెన్, డిస్టన్స్ ఎడ్యుకేషన్ విభాగాల్లో 44 రకాల 6 నెలల సర్టిఫికెట్ కోర్సులు అందిస్తున్నారు. తాజాగా, కాటేజ్ హార్టికల్చర్ టెక్నాలజీ, హైడ్రోపోనిక్స్ విధానంలో ఉద్యానవన పంటల సాగు తదితర కోర్సులు ప్రవేశపెట్టినట్లు వర్సిటీ ఒక ప్రకటనలో తెలిపింది.

11న అళగుముత్తుకోన్‌కు ఈపీఎస్ నివాళి

పెరంబూర్, జూలై 8: స్వాతంత్ర్య సమరయోధుడు అళగుముత్తుకోన్ 267వ గురుపూజ సందర్భంగా ఈ నెల 11న అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి నివాళులర్పించనున్నారు. ఎగ్మూర్ రైల్వేస్టేషన్ సమీపంలోని ఆయన విగ్రహానికి గురువారం ఉదయం పార్టీ నేతలతో కలిసి పళనిస్వామి నివాళులర్పిస్తారని అన్నాడీఎంకే కార్యాలయం సోమవారం ప్రకటన విడుదల చేసింది.

కొత్త క్రిమినల్ చట్టాలకు వ్యతిరేకంగా

హైకోర్టు న్యాయవాదుల విధుల బహిష్కరణ

చెన్నై, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు కొత్త క్రిమినల్ చట్టాలకు వ్యతిరేకంగా హైకోర్టు న్యాయవాదులు సోమవారం ఉదయం కోర్టు విధులను బహిష్కరించి ధర్నా నిర్వహించారు. కొత్త క్రిమినల్ చట్టాలను నిరసిస్తూ చేపట్టాల్సిన చర్యలపై హైకోర్టు న్యాయవాదుల సంఘం సమావేశం రెండు రోజుల క్రితం ఆ సంఘం అధ్యక్షుడు జి.మోహనకృష్ణన్ అధ్యక్షతన జరిగింది. కొత్త క్రిమినల్ చట్టాలకు వ్యతిరేకంగా ఈ నెల ఎనిమిదిన కోర్టు విధులను బహిష్కరించి ధర్నా జరపాలని ఆ సమావేశంలో నిర్ణయించారు. ఆ మేరకు సోమవారం ఉదయం న్యాయవాదులంతా కోర్టు విధులను బహిష్కరించారు. ఈ ఆందోళన కారణంగా సోమవారం జరిగిన పలు కేసుల్లో న్యాయవాదులు హాజరు కాకపోవడం ఆ కేసులన్నీ వాయిదాపడ్డాయి.



హైకోర్టు ప్రాంగణం వద్ద ధర్నా చేస్తున్న న్యాయవాదులు

కోవైలో అమానుషం

● వాటర్ సంప్‌లో మహిళ, కుమార్తెల శవాలు ● భర్త అరెస్టు



తంగరాజ్, పుష్ప, కుమార్తె షివాని - పుష్ప, ఆమె కుమార్తె హరిణి (ఫైల్‌ఫొటోలు)

చెన్నై, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు ఒండిపుదూరులోని ఓ ఇంటి వాటర్ సంప్‌లో ఓ మహిళ, ఇద్దరు చిన్నారుల మృతదేహాలు లభ్యమయ్యాయి. ఆ ముగ్గురిని ఆమె భర్త నీటి సంప్‌లోకి నెట్టి హతమార్చి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఒండిపుదూరు సమీపం వీవర్స్‌కాలనీలో తంగరాజ్, పుష్ప (35) అనే భార్యాభర్తలు నివసిస్తున్నారు. వీరికి హరిణి (9), షివాని (3) అనే ఇద్దరు కుమార్తెలున్నారు. తంగరాజ్ పెయింట్ పనులు చేస్తుంటాడు. ఇటీవల అతడికి మద్యం అలవాటు అధికమైంది. పనులకు వెళ్ళకుండా మద్యం తాగుతూ ఇంటివద్దే ఉండేవాడు. ఈ కారణంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. పుష్ప చుట్టుపక్కల ఇళ్లలో పనిచేసి చాలీచాలని సంపాదనతో కుటుంబాన్ని పోషిస్తూ వచ్చింది. ఈ నేపథ్యంలో సోమవారం వేకువజామున తంగరాజ్ ఇంటి వాటర్ సంప్‌లో పుష్ప, ఆమె ఇద్దరు కుమార్తెలు శవాలుగా తేలారు. ఈ విషయాన్ని తంగరాజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని ముగ్గురి మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు తరలించారు. పోలీసులు చుట్టుపక్కల వారిని విచారించగా తంగరాజ్ భార్యాపిల్లలను వాటర్ సంప్‌లోకి బలవంతంగా తోసి హతమార్చినట్లు తెలుసుకున్నారు. దీంతో తంగరాజన్‌ను అరెస్టు చేసి పోలీసులు తీవ్ర విచారణ జరుపుతున్నారు.

ఆస్పత్రి భవనం కూలిపడి కార్మికుడి మృతి



సహాయక చర్యల్లో పాల్గొంటున్న అగ్నిమాపక దళం

చెన్నై, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా కంభం వద్దనున్న ప్రభుత్వ ఆస్పత్రి భవనంపై కొత్తగా నిర్మిస్తున్న ప్రసూతి వార్డు భవనం పాక్షికంగా కూలిపడింది. సోమవారం ఉదయం సంభవించిన ఈ ప్రమాదంలో గోడ శిథిలాల మధ్యచిక్కుకుని ఓ కార్మికుడు దుర్మరణం చెందాడు. మరో కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. దీనిపై ఫిర్యాదు అందుకుని అగ్ని మాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని శిథిలాల మధ్యనున్న కార్మికుడి మృతదేహానికి వెలికి తీసి పోస్టుమార్టంకు తరలించారు. తీవ్రంగా గాయపడిన కార్మికుడి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి పంపారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

విద్యార్థిని ఉన్నత విద్యకు చేయూత



విద్యార్థినికి విద్యా సామగ్రి అందజేస్తున్న సమాజ సేవకుడు దినేష్ శరవణన్

వేలూరు, జూలై 8: స్థానిక సలవన్‌పేటకు చెందిన తండ్రి కోల్పోయిన విద్యార్థిని రామభారతి రంగాపురానికి చెందిన సమాజ సేవకుడు దినేస్ శరవణన్ ఏడాదికి సరిపడా విద్యాసామగ్రి అందజేశారు. రామభారతి సోమవారం నుంచి కళాశాలకు వెళ్లాల్సి ఉంది. ఆమె ఆర్థిక ఇబ్బందులను తెలుసుకున్న దినేష్ శరవణన్, ఏడాదికి సరిపడా నోటు పుస్తకాలు, బ్యాగ్, కొత్త దుస్తులు అందజేశారు. విద్యార్థినికి తదుపరి పుస్తకాలు, ఇతరత్రాలు అవసరమైతే వాటిని కూడా అందజేస్తానని ఈ సందర్భంగా దినేష్ శరవణన్ హామీ ఇచ్చారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వేలూరు, జూలై 8:! గుడియాత్తం పిచ్చానూరు ఆదిమూలమ్ స్వామి మఠం మాణిక్య వాచకర్ 112వ గురు పూజ వేడుకల సందర్భంగా సోమవారం జనరల్, దంత వైద్యశిబిరాలు నిర్వహించారు. కార్యక్రమానికి నిర్వాహక ట్రస్టీ ఎస్.అరుణాచలం అధ్యక్షత వహించగా, దంత వైద్యురాలు అభినయ, హోమియో వైద్యులు అభిరామి తదితరులు పాల్గొని, ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీజేశారు. ఈ శిబిరంలో 150 మందికి పైగా వైద్యపరీక్షలు చేయించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాన్ని ట్రస్టీ ఈశ్వరన్, జ్యోతి, మోహనం, కాశీనాథన్, జ్ఞానశేఖరన్, శ్రీనివాసన్, లోకనాథన్ పర్యవేక్షించారు.

ఎయిర్‌పోర్ట్‌లో 400 ఆఫ్రికన్ ఊసరవెల్లుల స్వాధీనం

● ఒకరి అరెస్టు

చెన్నై, జూలై 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనంబాక్కం అంతర్జాతీయ విమానాశ్రయంలో సోమవారం ఉదయం థాయ్‌లాండ్ నుంచి విమానంలో తరలించిన 402 ఆఫ్రికన్ ఊసరవెల్లులను కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని తీసుకొచ్చిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. థాయ్‌లాండ్ విమానంలో వచ్చిన ఓ ప్రయాణికుడు రెండు అట్టపెట్టెలతో వెళ్తుండగా కస్టమ్స్ అధికారులకు అనుమానం కలిగింది. వెంటనే ఆ ప్రయాణికుడిని ఆపి అట్టపెట్టెలు తెరచి చూడగా అందులో ఆఫ్రికన్ ఊసరవెల్లులున్నాయి. వాటిలో 67 ఊసరవెల్లులు ఊపిరాడక మృతి చెందినట్లు గుర్తించారు. వెంటనే ఆ ప్రయాణికుడిని విమానాశ్రయ పోలీసులకు అప్పగించారు. పోలీసులు అతడిని అరెస్టు చేసి విచారణ జరుపుతున్నారు. అదే సమయంలో థాయ్‌లాండ్ నుంచి వచ్చిన ఊసరవెల్లులను ఆ దేశానికే తిప్పిపంపటానికి అధికారులు చర్యలు చేపడుతన్నారు.

తూత్తుకుడిలో పారిశుధ్య కార్మికుల ధర్నా



ధర్నాచేస్తున్న కార్మికులతో చర్చలు జరుపుతున్న పోలీసు అధికారులు

చెన్నై,జూలై8(ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఆ కార్పొరేషన్‌లోని నాలుగు జోన్లలో డ్రైవర్లు, పారిశుధ్య కార్మికులు సుమారు 400మంది ఓ కాంట్రాక్టు సంస్థ ద్వారా నియమితులయ్యారు. కొన్నేళ్లుగా వీరంతా తమ వేతనాలను పెంచాలని, పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల పారిశుధ్య కార్మికులంతా కలిసి కాంట్రాక్టు సంస్థకు వినతిపత్రం కూడా సమర్పించారు. అయినా వారి వేతనాలు పెంచలేదు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా జరిపారు. రాష్ట్ర కార్పొరేషన్ సిబ్బంది నియామక చట్టం 1981ప్రకారం తమను పర్మనెంట్ చేయాలని, పారిశుధ్య కార్మికులకు రోజువారి వేతనాన్ని రూ.725లకు, డ్రైవర్లకు రూ.763ల చొప్పున చెల్లించాలని నినాదాలు చేశారు. కార్మికుల ధర్నా గురించి తెలుసుకున్న మేయర్ జగన్ పెరియసామి, పోలీసు ఉన్నతాధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకుని ఆందోళన జరుపుతున్న కార్మికులతో చర్చలు జరిపారు. పారిశుధ్య కార్మికుల డిమాండ్లపై త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని మేయర్ హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళనను తాత్కాలికంగా విరమించుకున్నారు.

ప్రత్యేక కోర్టుకు గుట్కా అవినీతి కేసు బదిలీ

ప్యారీస్, జూలై 8: గుట్కా అవినీతికి సంబంధించి మాజీ మంత్రులపై నమోదైన కేసు విచారణ ప్రత్యేక కోర్టుకు బదిలీ చేస్తూ సీబీఐ న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రంలో ఎక్సైజ్ విభాగం నిబంధనలు ఉల్లంఘించి అధికారులకు పెద్ద మొత్తంలో లంచాలు ముట్టజెప్పి గుట్కా ఉత్పత్తులు విక్రయించారన్న ఫిర్యాదులపై సీబీఐ విచారణ జరుపుతోంది. ఈ వ్యవహారంలో మాధవరావు, శ్రీనివాసరావు, ఉమాశంకర్ గుప్తా, ఆహార భద్రతా శాఖ అధికారి సెందిల్ మురుగన్, సెంట్రల్ ఎక్సైజ్ అధికారి నవనీతకృష్ణ పాండ్యన్, ఆరోగ్యశాఖ అధికారి శివకుమార్ అనే వారిపై కేసు నమోదైంది. వీరికి వ్యతిరేకంగా చెన్నై సీబీఐ న్యాయస్థానం ఛార్జిషీటు దాఖలైంది. ఈ నేపథ్యంలో, అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో మంత్రులుగా వ్యవహరించిన సి.విజయభాస్కర్, బీవీ రమణ, గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ సహా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల ఉన్నతాధికారులకు వ్యతిరేకంగా గత మే నెలలో అదనపు ఛార్జిషీటును సీబీఐ దాఖలుచేసింది. ఈ కేసు విచారణ సోమవారం సీబీఐ కోర్టు న్యాయమూర్తి ఎళిల్‌వలవన్ సమక్షంలో విచారణకు వచ్చింది. ఈ కేసులో మాజీ, ప్రస్తుత శాసనసభ్యులు ఉన్నందువల్ల విచారణను ఎంపీ, ఎమ్మెల్యేలపై కేసులు విచారించే ప్రత్యేక న్యాయస్థానానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేసిన న్యాయమూర్తి, తదుపరి విచారణ ప్రత్యేక కోర్టులో ఆగస్టు 2వ తేది జరుగనుందని ఉత్తర్వులు జారీచేశారు.

రైల్వే శాఖకు ప్రత్యేక బడ్జెట్

● టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై

ప్యారీస్, జూలై 8: రైల్వే శాఖకు పార్లమెంటులో ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టాలని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగై డిమాండ్ చేశారు. ఆ మేరకు సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... రైళ్లు నడుపుతున్న లోకో పైలెట్, అసిస్టెంట్ పైలెట్ పోస్టులు 22 శాతం భర్తీ చేయాలని తెలిపారు. అధిక ఛార్జీలు వసూలుచేస్తున్న వందే భారత్ రైళ్లలో 50 శాతానికి పైగా ప్రయాణికులు లేరని, టిక్కెట్టు ధర అధికం కావడంతో ప్రయాణికులు ఇతర రైళ్లలో వెళ్తున్నారని తెలిపారు. 1924వ సంవత్సరం నుంచి దేశంలో అమలులో ఉన్న రైల్వే బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం 2016లో రద్దు చేసిందని, రైల్వే శాఖకు ప్రత్యేక బడ్జెట్ దాఖలుచేయాలని ఆయన కోరారు.

డీఎంకే నేత, మహిళ దారుణహత్య

చెన్నై, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి సమీపం ముసిరి ప్రాంతంలో ఓ కార్మికుడు తనతో వివాహేతర సంబంధం ఉన్న మహిళను, డీఎంకే స్థానిక నాయకుడిని దారుణంగా హత్య చేసి పోలీసులకు లొంగిపోయాడు. ముసిరి వద్ద భర్తను విడిచిపెట్టిన గీతా అనే మహిళకు బాలచంద్రన్ అనే కార్మికుడితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త వివాహేతర సంబంధంగా మారింది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం గీతా ఇంటికి బాలచంద్రన్ వెళ్ళినప్పుడు వారి మధ్య గొడవ జరిగింది. ఆగ్రహించిన బాలచంద్రన్ వేటకొడవలిలో ఆమెపై దాడి జరిపి హతమార్చాడు. ఆ తర్వాత వీధిలో నడిచి వెళుతూ తన ఇంటి ఎదురుగా నివసించే డీఎంకే స్థానిక నాయకుడు రమేష్‌పై కూడా వేటకొడవళితో దాడి జరిపారు. తీవ్రంగా గాయపడిన రమేష్ అక్కడికక్కడే మరణించాడు. ఆ తర్వాత బాలచంద్రన్ పోలీసులకు లొంగిపోయాడు.

పెండింగ్ రైల్వే పథకాలు పూర్తిచేయాలి

● టీఎంసీ ఎంపీ జీకే వాసన్



టీఎంసీ రాష్ట్రస్థాయి నిర్వాహకుల సమావేశంలో జీకే వాసన్

ప్యారీస్,జూలై8: రాష్ట్రం లో పెండింగ్‌లో ఉన్న రైల్వే పథకాలను పూర్తిచేయాల్సిందిగా తమిళ మానిల కాంగ్రెస్ (టీఎం సీ) అధ్యక్షుడు, ఎంపీ జీకే వాసన్ కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆళ్వార్‌పేటలోని టీఎంసీ కార్యాలయంలో సోమవారం ఉదయం జీకే వాసన్ అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. ప్రధాన కార్యాలయ కార్యదర్శి జీఆర్ వెంకటేష్, ప్రధాన కార్యదర్శులు వీబీ జవహర్‌బాబు, శక్తి వడివేల్, తిరువేంగడం, మహిళా విభాగం అధ్యక్షురాలు రాణి కృష్ణన్ సహా జిల్లా అధ్యక్షులు, ప్రధాన నిర్వాహకులు పాల్గొన్నారు. సమావేశంలో ఆమోదించిన తీర్మానాలపై జీకే వాసన్ మాట్లాడుతూ... రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.

రైతులు మట్టి తీసుకెళ్లేందుకు అనుమతి

వేలూరు, జూలై 8: రైతులు, మట్టి పాత్రల కార్మికులకు ఎలాంటి రుసుము లేకుండా బంక మట్టి, ఒండ్రు మట్టి తీసుకెళ్లొచ్చని వేలూరు ఎంపీ కదిర్ ఆనంద్ తెలిపారు. చెన్నై సచివాలయంలో ఈ పథకాన్ని సోమవారం ముఖ్యమంత్రి స్టాలిన్ లాంచనంగా ప్రారంభించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీ కదిర్ ఆనంద్ పాల్గొని, 10 మంది రైతులకు మట్టి తీసుకెళ్లేందుకు అనుమతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని జలవనరుల శాఖ ఆధ్వర్యంలో 105 చెరువులు, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధీనంలోని 303 చెరువుల్లోని ఒండ్రు మట్టిని రైతులు తీసుకెళ్లొచ్చని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి శాఖ పథక డైరెక్టర్ ఆర్తీ, కాట్పాడి యూనియన్ కమిటీ అధ్యక్షుడు వేల్‌మురుగన్, ఇంజనీర్ ప్రభాకరన్, కలెక్టర్ పీఏ (వ్యవసాయం) తేన్‌మొళి, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ సోము, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అనుమతి పత్రాలు అందజేస్తున్న ఎంపీ కదిర్ ఆనంద్, కలెక్టర్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, జూలై 8: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

వ్యాసర్పాడి: కొడుంగైయూర్, ఆండాళ్ నగర్, అన్నై థెరిస్సా నగర్, ఐశ్వర్య నగర్, అభిరామి అవెన్యూ, మనలి రోడ్డు, లక్ష్మీ అమ్మన్ నగర్ 1 నుంచి 3 వీధులు, తెంద్రల్ నగర్ 1 నుంచి 8 వీధులు, వేదాంత మురుగప్పన్ వీధి, అన్నై అవెన్యూ 1 నుంచి 3 వీధులు, ఎస్సార్ నగర్, విజయలక్ష్మి నగర్, భద్రగిరి నగర్, రాఘవేంద్ర నగర్, గణేశ్ నగర్, సుగంధమ్మాళ్ నగర్, బాలాజి నగర్, శక్తి నగర్, కేఎంఏ గార్డెన్, టీహెచ్ రోడ్డు, కేకేడీ నగర్ బ్లాక్ 1 నుంచి 9 వరకు, సిడ్కో నగర్, ఏకేఎం నగర్, ఎస్టేట్ ఏరియా, దామోదరన్ నగర్, గోల్డన్ కాంప్లెక్స్, జేజేఆర్ నగర్, ఎస్‌ఎం నగర్ బ్లాక్ 25 నుంచి 88 వరకు, సామందిపూ కాలని, మల్లిగైపూ కాలనీ, ఆర్‌ఆర్ నగర్, కేపీ 4వ వీధి, వ్యాసర్పాడి పుదునగర్ వెస్ట్, సౌత్ వీధులు, సెంట్రల్ అవెన్యూ 1 నుంచి 9 క్రాస్ వీధులు, వెస్ట్ అవెన్యూ రోడ్డు, వాటర్‌బోర్డు పంపింగ్ స్టేషన్, మధ్య క్రాస్ వీధులు 10 నుంచి 19 వరకు, 4,7,8 మెయిన్ రోడ్డు, నార్త్ అవెన్యూ రోడ్డు

కేకే నగర్: వలసరవాక్కం ఎక్స్‌టెన్షన్, సురేష్ నగర్, పిల్లయార్ ఆలయ వీధి, వావూసీ నగర్, కాశి ఎస్టేట్, బీఎల్‌ఎస్ ప్రసాద్ నగర్, కక్కన్‌కుప్పం, అన్నాజీరావు నగర్

గిండి: శాంతి నగర్, సురేందర్ నగర్, కచ్చేరి నగర్, విద్యా నగర్, ముత్యాలరెడ్డి నగర్, భారతిదాసన్ వీధి, బాలాజి నగర్, ఉల్లగరం ఉషా నగర్

సిరుచ్చేరి: సీటీఎస్, ఐటీసీ, సిరుచ్చేరి సిప్కాట్

అడయార్: కొట్టివాక్కం, జర్నలిస్ట్ కాలని, శ్రీనివాసపురం, న్యూ బీచ్ రోడ్డు, కావేరి నగర్ 1 నుంచి 6 వీధులు, కర్పగాంబాల్ నగర్, లక్ష్మణపెరుమాళ్ నగర్, తిరువళ్లువర్ నగర్ 1 నుంచి 59 వీధులు, భగత్‌సింగ్ రోడ్డు, వెంకటేశ్వర నగర్ 1 నుంచి 21 వీధులు, న్యూ కాలని 1 నుంచి 4 వీధులు, కొట్టివాక్కం కుప్పం, భజన ఆలయ వీధి, ఈసీఆర్ మెయిన్ రోడ్డు, మరుందీశ్వర ఆలయం నుంచి ఖజురా గార్డన్ వరకు, పర్శిటీ నగర్, సౌత్, నార్త్, ఈస్ట్ మాడవీధులు, పిల్లయార్ ఆలయ వీధి, రాజా రంగస్వామి అవెన్యూ 1 నుంచి 4 వీధులు, బీచ్ వార్డ్ రోడ్డు, బాలకృష్ణ హైరోడ్డు, వాల్మీకి నగర్, కళాక్షేత్ర రోడ్డు, సీబీఐ కాలని, పోలీస్ క్వార్టర్స్, తిరువీధి అమ్మన్ ఆలయ వీధి, సంగం కాలని, కామరాజ్ రోడ్డు, కందస్వామి నగర్, పాలవాక్కం 3,4 మెయిన్ రోడ్డు, కామరాజ్ నగర్, పీటీసీ డిపో, తిరువళ్లువర్ రోడ్డు 5 నుంచి 24 క్రాస్ వీధులు, కామరాజ్ నగర్ సౌత్ అవెన్యూ, మంగలేరి

అంబత్తూర్: కళ్లికుప్పం, గంగై నగర్, ముత్తమిళ్ నగర్, మూకాంబిగై నగర్, సర్వీస్ రోడ్డు, రెడ్‌హిల్స్ రోడ్డు, రామాపురం బజార్, వరదరాజపురం, రైల్వేస్టేషన్ రోడ్డు, బజారు రోడ్డు, పత్రవాక్కం రోడ్డు, సౌందర్య నగర్, అళగేశన్ నగర్, కొరట్టూర్, ఆర్‌ఎస్ రోడ్డు, రెడ్డి వీధి, భారతి నగర్, రైల్వేస్టేషన్ రోడ్డు, తిరుముల్లైవాయల్ రోడ్డు, మాణిక్యంపిళ్లై వీధి, మేనాంబేడు రోడ్డు, ఎంటీహెచ్ రోడ్డు, పాడి, పంపింగ్ స్టేషన్, కొరట్టూర్ బస్టాండ్, కొరట్టూర్ రైల్వేస్టేషన్, వెంకట్రామన్ నగర్, లక్ష్మణ మొదలి వీధి, దురైస్వామిరెడ్డి వీధి, టీఎన్‌హెచ్‌బీ కాలని 61 నుంచి 71 వీధులు, నార్త్ అవెన్యూ

మధురవాయల్: ఆలపాక్కం, ధనలక్ష్మి నగర్, నేతాజి నగర్ 1 నుంచి 4 వీధులు, ఆలపాక్కం మెయిన్ రోడ్డు, శ్రీనివాస నగర్ 1,2 వీధులు, గోవిందప్ప నాయకర్ 1,2,3 వీధులు, సుందర్‌నగర్ 1 నుంచి 7 వీధులు, నటేశన్ నగర్, అష్టలక్ష్మి నగర్ 23వ వీధి

పల్లావరం: జైన్ ఈస్ట్ మెయిన్ రోడ్డు, శంకర్ నగర్ మెయిన్ రోడ్డు, గాంధీ నగర్ మెయిన్ రోడ్డు, శంకర్ నగర్ 17 నుంచి 19 వీధులు, పిల్లయార్ ఆలయ వీధి, తిరునీర్‌మలై మెయిన్ రోడ్డు, ఎల్‌ఐసీ కాలని 4వ వీధి

పోరూర్: కోవూర్, ఆలయవీధి, తంగం అవెన్యూ, మూకాంబిగై నగర్, ఈశ్వర్ నగర్, వీఎస్ నగర్, పొన్నియమ్మన్ నగర్, సాయి నగర్, తిల్లై నటరాజర్ నగర్, మధుర గార్డన్, మాంగాడు, కొలుమణివాక్కం, నెల్లితోపు, మహాలక్ష్మి నగర్, తిరుపతి నగర్, మారుతి నగర్, జననినగర్, గురుఅవెన్యూ, శ్రీనివాస నగర్, మాసిలామణి నగర్, మేల్మానగర్, మల్లిగనగర్, ఛార్లెస్ నగర్, శబరినగర్, రాజీవ్‌నగర్, అమ్మన్‌నగర్, లక్ష్మీనగర్, కుండ్రత్తూర్ మెయిన్ రోడ్డు, కేకేనగర్, అన్నావీధి, గోవిందరాజ్‌నగర్, అలెక్స్‌నగర్, ఎన్‌ఎస్కే అవెన్యూ

మాంజోలై కార్మికుల తొలగింపుపై స్టే కొనసాగింపు

● హైకోర్టు ఉత్తర్వులు

ప్యారీస్, జూలై 8: తిరునల్వేలి జిల్లాలోని మాంజోలై తేయాకు తోటలో పని చేస్తున్న కార్మికుల తొలగింపుపై విధించిన స్టే ఉత్తర్వులు మద్రాసు హైకోర్టు మదురై బెంచ్ పొడిగిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. మాంజోలై తేయాకు తోటలో పనిచేస్తున్న కార్మికులకు పునరావాసం కల్పించాలని కోరుతూ దాఖలైన కేసు విచారణ సోమవారం జరిగింది. కార్మికుల తరఫున హాజరైన న్యాయవాది, ఈ తేయాకు తోటను రాష్ట్రప్రభుత్వ నిర్వహణలోని టాన్ టీ సంస్థకు అప్పగించేలా పరిశీలించాలని కోరారు. ఈ వ్యవహారంలో రాష్ట్రప్రభుత్వం మానవతా దృక్పథంతో వ్యవహరించి కార్మికులకు అండగా నిలవాలని న్యాయస్థానం సలహా ఇచ్చింది. ప్రభుత్వం ఈ సమస్యను సుదీర్ఘంగా పరిశీలించి శాశ్వత పరిష్కారంతో నివేదిక దాఖలుచేయాలని న్యాయస్థానం నోటీసు జారీచేసింది.

మళ్లీ షోలింగనల్లూర్-సిరుచ్చేరి మెట్రోపనులు ప్రారంభం

ఐసిఎఫ్, జూలై 8: షోలింగనల్లూర్-సిరుచ్చేరి మెట్రో పనులు మళ్లీ ఆదివారం ప్రారంభమయ్యాయి. నగరంలో రెండో విడత మెట్రోరైలు పథకం పనులు 116.1 కి.మీ మేర మూడు మార్గాల్లో జరుగుతున్నాయి. అందులో మాధవరం నుంచి సిరుచ్చేరి సిప్కాట్ వరకు మూడో మార్గం 45.4 కి.మీ ఉంది. ఈ పథకాన్ని రెండుగా విభజించి వేర్వేరు ఒప్పందదారులకు అప్పగించారు. ఈ మార్గంలో పాత మహాబలిపురం రోడ్డులో షోలింగనల్లూర్ నుంచి సిరుచ్చేరి సిప్కాట్ వరకు జరుగుతున్న పనులు కొన్ని కారణాలతో ఆగిపోయాయి. కొన్ని నెలలు ఆగిన ఈ పనులు సమస్యలు పరిష్కారం కావడంతో ఆదివారం నుంచి ప్రారంభమైనట్లు అధికారులు తెలిపారు.

21న చాతుర్మాస దీక్ష

● ప్రారంభించనున్న విజయేంద్ర స్వామి

ఐసిఎఫ్, జూలై 8: కాంచీపురం శంకర మఠం 70వ పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి ఈ ఏడాది వ్యాస పూజ, చాతుర్మాస దీక్ష ప్రారంభించనున్నారు. ఈ నెల 21 నుంచి సెప్టెంబరు 18వ తేది వరకు ఓరిక్కై మహా పెరియవర్ మణిమండపంలో దీక్ష ఆచరించనున్నారు. చాతుర్మాస దీక్ష ఆడి పౌర్ణమి నుంచి కార్తీక మాస పౌర్ణమి వరకు నాలుగు నెలలు ఆచరించదగిన శక్తివంతమైన వ్రతాల్లో ఒకటి. ఈ దీక్షలో త్రిపురసుందరి సమేత చంద్రమౌళీశ్వరునికి ప్రత్యేక పూజలు, చతుర్వేద పారాయణం, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, భక్తి సంగీత కచేరి వంటివి నిర్వహించనున్నారు. ఈ నెల 27వ తేది శంకర మఠం 69వ పీఠాధిపతి జయేంద్ర సరస్వతి స్వామి 90వ జయంతి మహోత్సవం ఓరిక్కై మహా పెరియవర్ మండపంలో జరుగనుందని మఠం నిర్వాహకులు తెలిపారు.

కన్వేయర్ బెల్టులో చిక్కుకుని కార్మికుడి మృతి



ఎన్నెల్సీ కార్మికుడు అన్బళగన్ మృతదేహం

చెన్నై, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా ఎన్నెల్సీ రెండో సొరంగంలో నేలబొగ్గు వెలికితీసే యూనిట్ వద్ద కన్వేయర్ బెల్టులో చిక్కుకుని ఓ కార్మికుడు దుర్మరణం చెందాడు. నైవేలి సమీపం మందారకుప్పం ప్రాంతానికి చెందిన అన్బళగన్ రెండో సొరంగం నేలబొగ్గు తవ్వకాల యూనిట్ వద్ద కన్వేయర్ బెల్టు పనులను పరిశీలిస్తుంటారు. సోమవారం ఉదయం ఎప్పటివలెనే అన్బళగన్ డ్యూటీ చేస్తుండగా ఉన్నట్టుండి కన్వేయర్ బెల్టులో చికుక్కుని తీవ్ర గాయాలతో మృతి చెందారు. ఈ సంఘటనపై మందారకుప్పం పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరిపారు. ఈ విషయం తెలుసుకున్న అన్బళగన్ కుటుంబీకులు, బంధువులు, స్నేహితులు ఎన్నెల్సీ రెండో యూనిట్ వద్ద ధర్నాకు దిగారు. అన్బళగన్ మృతికి భారీగా నష్టపరిహారం చెల్లించాలంటూ డిమాండ్ చేశారు.

ఆరు పంచలోహ విగ్రహాల స్వాధీనం

● ముగ్గురి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న విగ్రహాలు

ప్యారీస్, జూలై 8: విదేశాలకు తరలిస్తున్న రూ.22 కోట్ల విలువైన ఆరు పంచలోహ విగ్రహాలను స్వాధీనం చేసుకొని ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు విగ్రహాల అక్రమ తరలింపు నిరోధక విభాగం అధికారులు తెలిపారు. తంజావూరు-తిరుచ్చి జాతీయ రహదారిలో ఈ విభాగం అధికారులు ఈ నెల 6వ తేది తనిఖీలు చేపట్టారు. సేలం ప్రాంతానికి చెందిన రాజేష్‌కన్నన్, లక్ష్మణ్, తిరుమురుగన్ ప్రయాణిస్తున్న కారును ఆపి తనిఖీ చేశారు. అందులో మూడడుగుల త్రిపురానందకర్, దక్షిణామూర్తి, రుషబదేవర్ తదితర ఆరు దేవతామూర్తుల విగ్రహాలు గుర్తించి స్వాధీనం చేసుకుని ఆ ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో... ఈ ఆరుదైన దేవతామూర్తుల విగ్రహాలను విదేశాలకు తరలించే ప్రయత్నంలో పట్టుబడినట్లు తెలిసింది.

20 యేళ్ళ కష్టార్జితమే పోయెస్ గార్డెన్ ఇల్లు

● హీరో ధనుష్



నగరంలోని పోయెస్ గార్డెన్‌లో తాను కొత్తగా నిర్మించుకున్న ఇల్లు 20 యేళ్ళ కష్టార్జితమని హీరో ధనుష్ చెప్పారు. ఆయన స్వీయ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న చిత్రం 'రాయన్'. ఈ నెలాఖరులో విడుదలకానుంది. ఈ చిత్రం ఆడియో రిలీజ్ నగరంలో తాజాగా నిర్వహించారు. ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్ పతాకంపై కళానిధి మారన్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కించారు. ఏఆర్.రెహ్మాన్ సంగీతం సమకూర్చిన ఈ చిత్రం ఆడియో రిలీజ్ వేడుకలో హీరో ధనుష్ మాట్లాడుతూ, 'పోయెస్ గార్డెన్‌లో సూపర్‌స్టార్ రజనీకాంత్ ఇంటిని చూడాలని చిన్నప్పటి నుంచే కోరిక ఉండేది. అపుడే పోయెస్ గార్డెన్‌లో ఒక చిన్న ఇల్లు కొనుగోలు చేయాలని ఆశపడ్డాను. 16 యేటలోనే 'తుల్లువదో ఇళమై' అనే సినిమాలో నటించాను. ఆ సినిమా హిట్ కాకుండా ఉండివుంటే నేను ఎక్కడ ఉండేవాడినో నాకే తెలియదు. దాదాపు 20 యేళ్ళ తర్వాత కఠోర శ్రమకు లభించిన బహుమతే ఈ పోయెస్ గార్డెన్ ఇల్లు. పైగా, నేనేంటో నాకు బాగా తెలుసు. నన్ను పుట్టించిన ఆ శివుడికి తెలుసు. నా తల్లిదండ్రులకు తెలుసు. నా బిడ్డలకు తెలుసు. కెరీర్ ఆరంభం నుంచి పొదుపు చేసే అలవాటుంది. అనవసరపు వివాదాలు, వెన్నుపోట్లు, చెడ్డపేరు ఇలా అనేక సంఘటనలు జరిగినప్పటికీ ఇపుడు ఇలా మీ ముందు నిలబడివున్నానంటే కారణం నా అభిమానులు' అని పేర్కొన్నారు.

కోలీవుడ్‌కు మరో కన్నడ భామ



చైత్ర ఆచార్

తమిళం, తెలుగు చిత్రపరిశ్రమలో పలువురు కన్నడ హీరోయిన్లు రాణిస్తున్నారు. తాజాగా మరో హీరోయిన్ కోలీవుడ్‌లోకి అడుగుపెడుతోంది. ఆమె పేరు చైత్ర ఆచార్. సీనియర్ నటుడు శశికుమార్ హీరోగా నటించే చిత్రంలో కథానాయికగా నటించనుంది. రాజు మురుగన్ దర్శకత్వం వహించే ఈ చిత్రంలో హీరోయిన్‌గా చైత్య పేరును ఖరారు చేశారు. త్వరలోనే ఈ చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకెళ్ళనున్నారు. కాగా, 'జోకర్', 'కుక్కూ', 'జపాన్' వంటి చిత్రాలను రాజు మురుగన్ తెరకెక్కించారు. అయితే, హీరో కార్తీ నటించిన 'జపాన్'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. కానీ, ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద ప్రేక్షకులను తీవ్ర నిరాశకు లోనుచేసింది. ఈ నేపథ్యంలో రాజు మురుగన్ తన కొత్త ప్రాజెక్టును శశికుమార్‌తో ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. శ్యాన్ రోల్డన్ సంగీతం అందించే ఈ చిత్రం ప్రీప్రొడక్షన్ నిర్మాణ పనులు జరుపుకుంటుంది.

'కానిస్టేబుల్ నందన్'గా యోగిబాబు

చిత్రజ్యోతి



కొత్త చిత్రం పూజా కార్యక్రమం

ప్రముఖ హాస్య నటుడు యోగిబాబు మరోమారు కథానాయకుడిగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి 'కానిస్టేబుల్ నందన్' అనే టైటిల్ ఖరారు చేశారు. భూపాలన్ నటేశన్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. శంకర్ పిక్చర్స్ పతాకంపై డి.శంకర్ తిరువణ్ణామలై నిర్మిస్తున్నారు. దర్శకులు సుందర్, శశికుమార్, ఎం.కళంజియం వంటి వారివద్ద సహాయ దర్శకుడిగా భూపాలన్ పని చేశారు. ఈ సినిమా షూటింగ్ ఆదివారం తిరువణ్ణామలైలో ప్రారంభమైంది. సినిమా గురించి నిర్మాత డి.శంకర్ మాట్లాడుతూ, 'ఎంతో మంది నటీనటులకు ఆదర్శంగా నిలిచిన యోగిబాబు వంటి గొప్ప నటుడితో కలిసి పనిచేయడం గర్వంగావుంది. కథ చెప్పేటపుడే ఆయన చూపిన అభిరుచి, ఆసక్తి ఎంతగానో ఆకట్టుకుంది. పలువురు దర్శకుల వద్ద పనిచేసి అనేక విషయాలు నేర్చుకున్న భూపాలన్ దర్శకత్వంలో ఒక మంచి కథతో సినిమా తీస్తుండటం సంతోషంగా ఉంది' అని అన్నారు. దర్శకుడు భూపాలన్ మాట్లాడుతూ, 'మంచి కథలతో సినిమాలు నిర్మించేందుకు ఇష్టపడే నిర్మాతలు దొరకడం అదృష్టం. చెప్పిన కథ విని సినిమా తీసేందుకు ముందుకు వచ్చిన నిర్మాతకు ధన్యవాదాలు. ఇండస్ట్రీలో ప్రతి ఒక్కరికీ ఇష్టమైన యోగిబాబు వంటి నటుడితో కలిసి పనిచేయడం ఆనందంగా ఉంది. హాస్య నటుడిగా కెరీర్ పీక్ స్టేజ్‌కు చేరుకున్నపుడు ధైర్యంగా లీడ్ రోల్స్ చేయడం గొప్పవిషయం. 'కానిస్టేబుల్ నందన్' ఆయన కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలుస్తుంది. ఇందులో నెగెటివ్ రోల్ కూడా ఉంది. టాలెంట్ ఉన్న నటుడిని ఎంపిక చేసి త్వరలోనే వెల్లడిస్తాం' అని పేర్కొన్నారు.



'విడాముయర్చి'లో అజిత్

'ప్రయత్నాలు విఫలం కావు' అంటున్న అజిత్

● 'విడాముయర్చి' నుంచి సెకండ్ లుక్

అగ్రహీరో అజిత్ కుమార్ నటిస్తున్న కొత్త చిత్రం 'విడాముయర్చి'. మగిళ్ తిరుమేణి దర్శకుడు. ఈ సినిమా ఫస్ట్‌లుక్ గతంలో రిలీజ్ చేయగా, తాజాగా సెకండ్ లుక్ పేరుతో రెండు పోస్టర్లను రిలీజ్ చేశారు. 'ప్రయత్నాలు విఫలం కావు' అనే క్యాప్షన్‌తో విడుదల చేసిన ఈ పోస్టర్లు ఇపుడు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఒక పోస్టరులో అజిత్ కుమార్ కారు డ్రైవింగ్ చేస్తుంటే, మరో పోస్టరులో రైఫిల్ పట్టుకుని కనిపించారు. 'తుణివు' వంటి హిట్ చిత్రం తర్వాత అజిత్ నటిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రముఖ నిర్మాత సుభాస్కరన్ లైకా ప్రొడక్షన్స్ పతాకంపై భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నారు. త్రిష, అర్జున్, రెజీనా, ఆరవ్ వంటి నటీనటులు నటిస్తున్నారు. గత యేడాది అక్టోబరులో అజర్‌బైజాన్‌లో షూటింగ్ జరుపుకోగా, ఇపుడు ఉత్తర భారతంలోని పలు లోకేషన్లలో చిత్రీకరిస్తున్నారు. అజిత్ నటిస్తున్న 62వ చిత్రం కాగా, ఇందులో ప్రధాన విలన్ పాత్రలో యాక్షన్ కింగ్ అర్జున్ నటిస్తుండటం గమనార్హం.





అతిథులు దేవరకొండ రాజు, నిత్యశ్రీ మహాదేవన్, శాంతి సురేష్ తదితరులను సత్కరిస్తున్న నిర్వాహకులు - సంగీత అష్టావధానంలో గానకోకిల పి.సుశీల, సాలూరి వాసూరావు, సాయికృష్ణ యాచేంద్ర తదితరులు

ఘనంగా మంగళంపల్లి జయంతి

బాలమురళికి గీతాలతో నివాళి ● ఆకట్టుకున్న సంగీత అష్టావధానం



కేసీటీ ఆర్గనైజర్ రాజ్యలక్ష్మిని సత్కరిస్తున్న దృశ్యం

ప్యారీస్, జూలై 8: నగరంలోని కళారంజని చారిటబుల్ ట్రస్ట్, కళారంజని స్కూల్ ఆఫ్ మ్యూజిక్ సంయుక్త ఆధ్వర్యంలో సంగీత విద్వాంసులు పద్మవిభూషణ్ డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ 95వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. టి.నగర్ పిట్టి త్యాగరాయ ఆడిటోరియంలో ఆదివారం ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు సాగిన మురళీగాన ప్రవాహం సంగీత ప్రియులను పరవశింపజేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బెంగళూరు తదితర ప్రాంతాలకు చెందిన సంగీత కళాకారులు, గానకోకిల పద్మవిభూషణ్ పి.సుశీల, డా.వీబీ సాయికృష్ణ యాచేంద్ర, ప్రముఖ సంగీత దర్శకుడు సాలూరి వాసూరావు, తమిళనాడు తెలుగు పీపుల్స్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు, సేవారత్న దేవరకొండ రాజు, ప్రముఖ గాయకులు డా.నిత్యశ్రీ మహాదేవన్, శాంతి సురేష్, తిరువయ్యారు శేఖర్ పాల్గొని బాలమురళీకృష్ణ గీతాలు శ్రావ్యంగా ఆలపించి నివాళులర్పించారు. కళారంజని చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డా.జె.శ్రీనిబాబు, కార్యదర్శి రాజ్యలక్ష్మి అతిథులకు జ్ఞాపికలు అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దేవరకొండ రాజు ప్రసంగిస్తూ... కర్ణాటక సంగీత విద్వాంసులు బాలమురళీకృష్ణ జయంతి వేడుకల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో తమ సంస్థ తరపున ఇలాంటి సంగీత కార్యక్రమాలు ఏర్పాటుచేసి యువ కళాకారులకు ప్రోత్సాహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శోభారాజా, పొన్నూరు మణిమాలరావు, బెల్లంకొండ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముచ్చటగా మూడు నిమిషాలే !

● ఎలాంటి చర్చ జరగకుండానే ముగిసిన తిరునల్వేలి కార్పొరేషన్ సమావేశం



డిప్యూటీ మేయర్ రాజ్ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

ప్యారీస్, జూలై 8: తిరునల్వేలి కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమై ఎలాంటి తీర్మానాలు ఆమోదించకుండానే మూడే నిమిషాల్లో ముగిసింది. మేయర్ శరవణన్ పదవి నుంచి వైదొలిగిన నేపథ్యంలో, డిప్యూటీ మేయర్ రాజ్ నేతృత్వంలో కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మేయర్ పదవి నుంచి తప్పుకుంటున్నట్లు శరవణన్ రాసిన లేఖను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఆ తర్వాత కౌన్సిల్ సమావేశం తేది త్వరలోనే ప్రకటిస్తామని డిప్యూటీ మేయర్ రాజ్ ప్రకటించారు. దీంతో, ఈ సమావేశంలో కార్పొరేషన్ పరిధిలో చేపట్టాల్సిన కొత్త పథకాలు, ఇతర తీర్మానాలపై చర్చ జరగకుండానే కేవలం మూడు నిముషాల వ్యవధిలో ముగిసింది. ఈ కార్పొరేషన్ మేయర్‌గా వ్యవహరించిన శరవణన్ గత వారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ కార్పొరేషన్‌లో మొత్తం ఉన్న 55 వార్డుల్లో 51 స్థానాల్లో డీఎంకే, కూటమి పార్టీలకు చెందిన కౌన్సిలర్లున్నారు. వీరిలో పలువురు తిరునల్వేలి జిల్లా డీఎంకే మాజీ కార్యదర్శి, ఎమ్మెల్యే అబ్దుల్ వహాబ్ మద్దతుదారులు కావడం గమనార్హం. శరవణన్, అబ్దుల్ వహాబ్‌ల మధ్య ఏర్పడిన విభేదాల కారణంగా శరవణన్ మేయర్ పదవి కోల్పోయారని, అందువల్ల కార్పొరేషన్‌లో అభివృద్ధి స్తంభించాయని అన్నాడీఎంకే, బీజేపీ పార్టీలు విమర్శిస్తున్నాయి.

'గో ఫర్ గోల్డ్' పేరుతో శరత్ కమల్‌కు టైమ్‌లింక్స్ బెస్ట్ విషెస్

● బ్రాండ్ అంబాసిడర్‌గా నియామకం



శరత్‌కమల్

అడయార్, జూలై 8: పారిస్ ఒలింపిక్స్ 2024లో పాల్గొంటున్న భారత సీనియర్ టేబుల్ టెన్నిస్ ఆటగాడు శరత్ కమల్‌కు టైమ్ లింక్స్ శుభాకాంక్షలు తెలిపింది. 'గో ఫర్ గోల్డ్' పేరుతో బెస్ట్ విషెస్ తెలుపుతూ తమ కంపెనీకి బ్రాండ్ అంబాసిడర్‌గా శరత్ కమల్‌ను ఎంపిక చేసినట్టు పేర్కొంది. పారిస్ ఒలింపిక్స్ 2024లో తమ కంపెనీ బ్రాండ్ అంబాసిడర్‌గా శరత్ కమల్‌ను ఎంపిక చేయడం సంతోషంగా ఉందని అన్నా నగర్‌లోని టైమ్ లింక్స్ మేనేజింగ్ డైరెక్టర్లు శివకుమార్, చిత్ర శివకుమార్ పేర్కొన్నారు. ఈ విషయంపై శరత్ కమల్ స్పందిస్తూ.. 'పారిస్ ఒలింపిక్స్ 2024లో టైమ్‌లింక్స్‌కి బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండటం ఎంతో సంతోషంగా ఉంది. ఒలింపిక్స్‌లో భారతదేశం గర్వపడేలా చేయడం, భవిష్యత్ తరాలకు చెందిన క్రీడాకారులకు స్ఫూర్తినివ్వడం నా లక్ష్యం' అని పేర్కొన్నారు.



సోమవారం చెన్నై సచివాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకున్న జపాన్ డిప్యూటీ రాయబారి కెంజి మియాతా



షోరూం ప్రారంభోత్సవంలో ప్రముఖులు

కాంచీపురంలో వారాహి లక్ష్మి సిల్క్స్ షోరూమ్

అడయార్, జూలై 8: దేశంలో పట్టు చీరలకు ప్రసిద్ధి చెందిన కాంచీపురం నడిబొడ్డున గాంధీ రోడ్డులో వారాహి లక్ష్మి సిల్క్స్ తన షోరూమ్ ప్రారంభించింది. ఈ షోరూమ్ నాణ్యమైన పట్టు, సాంప్రదాయ హస్తకళను ఇష్టపడేవారికి సర్వధామంలా ఉండనుంది. ఇందులో వివిధ రకాల పట్టు చీరలు సరసమైన ధరలకు లభించనున్నాయి. షోరూమ్ ప్రారంభోత్సవ వేడుకల్లో ఫ్యాషన్, వస్త్ర పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ముఖ్యంగా స్టూడియో హెచ్ మేనేజింగ్ డైరెక్టర్ సుమ హ్యారీస్ జయరాజ్, ప్రముఖ కాస్మెటాలజిస్ట్ డాక్టర్ సీమా ఆలిస్ మాథ్యూ, చెన్నై తిరువాన్మియూరులోని ది సీక్రెట్ గార్డెన్ కో ఫౌండర్ ఐశ్వర్య అర్జున్ వంటి అనేక మంది ప్రముఖులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఆధ్వర్యంలో వీధి శునకాల గణనపై శిక్షణాశిబిరం



శిక్షణా శిబిరం ప్రారంభోత్సవంలో పాల్గొన్న కమిషనర్ డాక్టర్ జే రాధాకృష్ణన్

చెన్నై, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వీధి శునకాలను లెక్కించేందుకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణా శిబిరం సోమవారం ప్రారంభమైంది. రిప్పన్‌భవనంలో కమిషనర్ డాక్టర్ జే రాధాకృష్ణన్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ప్రపంచ పశుగణన సేవా సంస్థ (డబ్ల్యూవీఎస్), రాష్ట్ర జంతువుల సంక్షేమ సంస్థ, మరికొన్ని స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగరంలోని వీధి శునకాలను లెక్కించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ ఆదేశాల మేరకు నగరంలో వీధి కుక్కల నుంచి చిన్నారులను కాపాడే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. 2018లో నగరంలో 59 వేల మేర వీధి కుక్కలుండేవని కార్పొరేషన్ పాత రికార్డులు తెలుపుతున్నాయన్నారు. ప్రస్తుతం ఆ శునకాల సంఖ్య విపరీతంగా పెరిగాయని, ఈ వివరాలను తెలుసుకునేందుకుగాను సిబ్బందికి, స్వచ్ఛంద సంస్థల వలంటీర్లకు శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ (ఆరోగ్యశాఖ) డాక్టర్ వి. జయచంద్ర భానురెడ్డి, డబ్ల్యూవీఎస్ డైరెక్టర్ డాక్టర్ కార్లెటీ అన్నీ ఫెర్నాండెజ్ తదితరులు పాల్గొన్నారు.

విక్రవాండిలో ముగిసిన ప్రచార హోరు

● రేపు ఉదయం పోలింగ్



ప్రచారంలో డీఎంకే వీరాభిమాని



వాహనాల తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు



పోలింగ్ సామగ్రి సిద్ధం చేస్తున్న ఉద్యోగులు

ప్యారీస్, జూలై 8: విల్లుపురం జిల్లా విక్రవాండి అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక ప్రచార హోరు సోమవారం సాయంత్రం ముగిసింది. ఈ నియోజకవర్గంలో ప్రచారం నిమిత్తం పొరుగూర్ల నుంచి వచ్చిన రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలు, నియోజకవర్గంతో సంబంధాలు లేని వారు వెంటనే వెళ్లిపోవాల్సిందిగా ఎన్నికల కమిషన్ ఆదేశించింది. బుధవారం ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో పోలింగ్ ప్రశాంతంగా సాగేలా ఈ నియోజకవర్గమంతటా ఎస్పీ నేతృత్వంలో పారా మిలిటరీ బలగాలు సహా 1,500 మందికి పైగా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. విక్రవాండి డీఎంకే ఎమ్మెల్యే పుహళేంది మృతిచెందడంతో ఈ నియోజకవర్గానికి ఉప ఎన్నిక నిర్వహించనున్నట్లు ఈసీ ప్రకటించింది. ఇందుకోసం గత నెల 14 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఇండియా కూటమిలో డీఎంకే అభ్యర్థిగా అన్నియూర్ శివ, ఎన్డీఏ కూటమిలో పీఎంకే అభ్యర్థిగా సి.అన్బుమణి, నామ్ తమిళర్ పార్టీ అభ్యర్థిగా అభినయ, ఇండిపెండెంట్లు సహా 29 మంది ఎన్నికల బరిలో ఉన్నారు. రెండు వారాలుగా డీఎంకే అభ్యర్థికి మద్దతుగా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మిత్రపక్షాల నేతలైన డీపీఐ ఎంపీ తిరుమావళవన్, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు సెల్వపెరుందగై, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణన్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్, ఐయూఎంఎల్ నేత ఖాదర్ మొహిద్దీన్, తమిళగ ముస్లిం మున్నేట్ర కళగం అధ్యక్షుడు జవాహిరుల్లా తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు. చివరి రెండు రోజులు మంత్రి ఉదయనిధి అభ్యర్థితో కలసి పలు వార్డుల్లో ప్రచారంలో పాల్గొన్నారు. అదే విధంగా నామ్ తమిళర్ పార్టీ ఆర్గనైజర్ సీమాన్, పీఎంకే వ్యవస్థాపకుడు డా.రాందాస్, అధ్యక్షుడు అన్బుమణి రాందాస్, సౌమ్య అన్బుమణి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, టీటీవీ దినకరన్ తదితరులు పీఎంకే అభ్యర్థి అన్బుమణికి మద్దతుగా పాల్గొన్నారు. సోమవారం సాయంత్రం 6 గంటలతో ప్రచారం ముగియడంతో విక్రవాండి నియోజకవర్గంలో పోలీసు భద్రత కట్టుదిట్టం చేశారు. 276 పోలింగ్ కేంద్రాల్లో 1,16,962 మంది పురుషులు, 1,20,040 మంది మహిళలు, 29 మంది ఇతరులు అని మొత్తం 2,37,031 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న పోలీసులు, 85 ఏళ్లకు పైబడిన సీనియర్ సిటిజన్లు, దివ్యాంగుల నుంచి పోస్టల్ ఓట్లను అధికారులు సేకరించి స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. నియోజకవర్గంలో సమస్యాత్మకమైనవిగా గుర్తించిన 44 పోలింగ్ కేంద్రాల వద్ద తుపాకులతో పారా మిలిటరీ బలగాలు, సూక్ష్మ పరిశీలకులు నియమితులయ్యారు.